# సముద్రం

ఉద్రేకంతో కెరటాల్ని తపతపా కొట్టుకుంటూ, అర్థంలేని కారణాలకీ తనని ఆశ్రయించే అమాయకుల్ని తిట్టుకుంటూ, పరాకుగా కాలుజారిన అనాథల కథల్ని లెక్కపెట్టుకొంటూ, అనుభూతుల కలల్ని మూటకట్టుకుంటూ, ముందుకు పోయే ఉద్రేకపు అలల్ని మళ్ళీ తనలోకి తనే నెట్టుకుంటూ తొందరపడి మాట తూలిన పెద్దమనిషిలాగ గొణుకొంటూంది. అన్ని సమస్యలకీ తనకో పరిష్కారం తెలిసినట్టు అందర్నీ కవ్వించి కాలు దువ్వుతుంది–సముద్రం.

* * * *

జీవితంలో మొదటి అనుభవాన్ని, పెంచుకొన్న మొదటి కోరికనీ, ఇచ్చిన మాటల్నీ తప్పిపోతున్న తారకరామారావు నుంచి తప్పుకోలేక దృష్టిని త్రిప్పుకున్న మంగతాయారుకి, ఆ సంధ్యవేళలో, గుండెలు మండే పడమటి ఆకాశపు పలచని ఎండని ఇంకా నెమరు వేసుకుంటున్న అలలు మొదటి ఓదార్పుని కలిగించాయి. ముందు వెనకలు మరిచిపోయిన యౌవనోద్రేకపు పర్యవసానాలకు సముద్రం 'తీర్పు' – నిరాశ్రయులయిన మానసిక వేదనా పాంథులకు సముద్రం చల్లని చలివేంద్రం – బుజ్జగించే ఓదార్పు.

సూర్యగ్రహణం రోజుల దినకరుని తేజాన్ని పాము మింగినవేళ బీదరికం సగం మింగిన శరీరాన్ని ఉప్పునీళ్ళలో కడుక్కొంటున్న ముత్తేలు మూడో కొడుకు, ఆరేళ్ళ కిందట ఆంధ్రుల అభిమాన చిత్రం పోస్టర్ గుడిసెగా చేసుకున్న చీకటి కోణంలో, మురికి

కాలువ పొరుగున, పక్కగదిలో ఆ రోజే షిప్పులోంచి దిగిన ఫ్రెంచి సోల్జర్ల రాక్షస రతికేకల సంగీతం మధ్య, తన చెల్లెలి బాధా కులిత ఆక్రందనాల్ని పెనవేసుకున్న చిరునవ్వుల మధ్య, విస్కీ వాసనల మధ్య, ఖరీదయిన విదేశీ సుఖవ్యాధుల మధ్య, సగం ఆరిన కిరసనాయిలు దీపం వెలుగులో, తాము బతికే చోట తలదాచుకొన్న మనుషుల్ని చూసి సిగ్గుపడి పారిపోతున్న పందికొక్కుల కలుగులో పుట్టాడు భావిభారతపౌరుడు. ఈ భారతభూమిలో కర్మకీ, ఖర్మకీ వారసుడు. వాడి బతుకును ఈడిగిల బడుతున్న శరీరంతో ఇటు సుఖానికీ, అటు ఉపాధికీ, ఇటు ప్రేమకీ, అటు ఆకలికీ తాకట్టు పెట్టిన కన్నతల్లి ఎన్నోసార్లు ఈ బుడతడు ఈ మురికి కడుపులో ఎలా పడాలి? పుట్టిపాడు బ్రతుకును సూసేకంటే సస్తే ఏ సొరగానికో ఎల్లిపోడా? అనుకున్న కన్నతల్లి అజ్ఞాత వాంఛను ఆకళించుకొని, అరక్షణంలో కెరటాల్ని జాచి తనలోకి లాగేసుకొంది సముద్రం–సముద్రం పారదర్శి–ఎన్నో క్షుభిత హృదయాలకూ, మరెన్నో క్షుధిత జీవితాలకూ సమవేది.

*****

జీతం వచ్చిన మూడోరోజు నుంచి లంచి వేళలో మంచినీళ్ళకు అలవాటుపడ్డ ఎల్డీసీ ఆనందరావు, కూతుర్ని కాపరానికి పంపడానికి, అరిటిపళ్ళు అరువు ఖాతా అడగడానికి బడ్డీకొట్టువాడి ముందు ముకం చెల్లక, పెద్దబ్బాయి ఆరోజు పెట్టుకోవాలన్న అరవయ్యో అప్లికేషన్‌కి ప్రవేశ రుసుం కట్టలేక, తెలుగు సినీమా చూడాలన్న 20 ఏళ్ళ వెలిసిపోయిన పాత ఆశని పెళ్ళాం ముఖంలో చూడలేక, అర్ధరాత్రి హెచ్చరించే తండ్రి దగ్గు తన బీదరికం అనీ, దానికి డాక్టరు టి.బి. అని దొంగపేరు పెట్టాడని గుర్తుంచుకోలేక, అకాలంలో ఆఖరి అబ్బాయి పోవడానికి సమయానికి వైద్య సమాయం లేకపోవడం కారణం కాదనీ, సమయానికి డాక్టరు కొనమన్న ఇంజక్షన్లు కొనడానికి తన జేబు తిరస్కరించిందని ఒప్పుకోలేక, నలభై ఏళ్ళు నాగరిక ప్రపంచంలో చాలా గౌరవంతో నమ్రతగా బీదరికాన్నీ, ప్రభుత్వం ఫైళ్ళనీ మోసిన ఆనందరావు, ఇంటికెళితే రక్తం ఆర్చుకుపోయిన భార్య కళ్ళలో ఆరాత్రి వంటకు అర్ధశేరు బియ్యానికి ప్రశ్న ఎదురవుతుందని, ఈ రోజుల్లోనే ఏదో ఒక రోజు తండ్రి ఊపిరి అయిష్టంగా సెలవు తీసుకుంటుందని తెలిసి, ఇంటికనుకొని దారి తప్పి, కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటిలో సముద్రానికి అడ్డంగా పడి ధైర్యంగా నడిచాడు. సముద్రం అవిధేయుడయిన భర్తకు ఆత్మగౌరవంతో సేవలు చేస్తున్న భార్యలాంటిది. అన్నిటినీ ఆనుషంగికంగా అనుభవించాక జీవితం అంతిమ దశలో గంభీరంగా తపస్సుచేసుకుంటున్న ఋషి.

*****

రాబోయే ప్రతి పడవలోనూ పదేళ్ళ కిందట మాయమయి పోయిన మామ తిరిగి వస్తాడని యౌవనం తొలిమెట్టు దగ్గరే వృద్ధాప్యాన్ని వరంగా తీసుకొని, జీవితాన్ని ఒకే ఒక్క ఆశగా, ఒక నివేదనగా, ఒక నిట్టూర్పుగా, ఒక పరీక్షగా, విశ్వాసంగా, నిశ్వాసంగా గడిపే మాలచ్చికి – మామని విరిగిపోయిన షిప్పుకాడ సముద్రమే మింగీసినాదని, లంగరు కొమ్మన

చిక్కుకొని అర్చుకుపోయిన ఎముకల గూడుకి వేలాడే చెవిపోగు మాలచ్చి పదేళ్ళు పదిలంగా దాచుకొన్న ఆశని నిప్పులపాలు చేసినప్పుడు 'ఓరిమామో! నువ్వు లేని బతుకు నాకేల? నువ్వేడుంటే నేనూ ఆడనే" అంటూ మీదిమీదికొచ్చిన మాలచ్చి మహాపాతివ్రత్యాన్ని సవినయంగా నిరూపించింది సముద్రం—ఆశలుగొన్న జీవితాలకు హఠాత్తుగా ముగింపు రాసే రక్కసి సముద్రం.

*****

ఆ కాలంలోనయినా అరువు తెచ్చుకున్న రంగులతో అందాన్ని నటించవచ్చునని అపార్థం చేసుకున్న నటీమణి, ఎప్పుడో వయస్సుకి రెక్కలొచ్చిన తొలిరోజుల్లో తొందర పాటుకి సాక్ష్యంగా మిగిలిన కొడుకు కాలేజీ చదువుకీ, వాడు బి.ఏ. పట్టాపుచ్చుకున్నాక రహస్యంగా నలుగురి మధ్యా నిలబడి కళ్ళారా చూడాలనే ఆనందాన్ని నెమరు వేసుకుంటూ అంతదాకా ఆకలినీ, అవసరాన్నీ చంపుకోవడానికి క్షణక్షణం జీవితాన్ని తాకట్టు పెడుతూ, ఎప్పుడో వెలిగే చిన్న దీపాన్ని ఊహించుకుంటూ క్షణక్షణం చీకట్లోకి అడుగులు వేసుకుంటూ, ఎప్పుడో కళ్లనిండా నిండే నీటితెరల కోసం మనస్సు అట్టడుగున మిగిలిన ఆనందపు పొరల కోసం, అనుక్షణం మృత్యువు ఒడిలోకి జారుకొంటూ ఆరాత్రి – ఆఖరి ఇన్‌స్టాల్‌మెంటు జీతాన్ని ఊహించుకొని అర్ధరాత్రి చేతిలో నలిగిపోతున్న తరుణంలో ఆరో విటుడికీ, అవసరార్థం ఏర్పరుచుకున్న భర్తకీ జరిగిన ఒప్పందం ప్రకారం మెత్తని తలగడా క్రింద, నలిగిన మల్లెపువ్వుల కింద, తీరని కోరికల కింద, తియ్యని ఆశయాల కింద ఆమె ఊపిరి స్తంభించిపోయినప్పుడు, ఆ రాత్రి నిశ్శబ్దంగా తనలో దాచుకొని నిండుకుండలాగ తల ఊపుతోంది సముద్రం. బాధ్యత మరిచిపోయిన బందిపోటులాంటిది సముద్రం—వయస్సులో వెర్రి తిరుగుళ్లకు పోయి పోయి వృద్ధాప్యంలో నిస్సహాయంగా నిలబడిపోయిన ముసిలి హంతకుడిలాగా మూగనోము పట్టుకొంది సముద్రం.

*****

అలవాటుగా వయస్సుని నమ్ముకొన్న ఓ అందగాడికి, మనస్సుని నమ్ముకొన్న ఓ అమాయకురాలు వయస్సుని అమ్ముకొన్నప్పుడు ఇటు పేగును పంచుకొన్న కన్నవారూ, అటు నిస్సహాయపు కథ విన్నవారూ, అందరూ చేతులు కడుక్కొన్నప్పుడు ఆకలి తీరిన కుర్రాడు అవసరం తీరాక బాధ్యతల్ని విదిలించుకొన్నప్పుడు, 'తప్పు'ను గుర్తుపట్టడం తెలీని వయస్సులో తప్పనిసరిగా అందులో తలమునకలయినప్పుడు ఆ అందమయిన ఆడపిల్ల ఏం చెయ్యాలో ఏడు నెలలు ఆలోచించి నానాటికీ పెరిగే నలుగురి మాటల్ని భరించలేక, ఓ వర్షాకాలం తనని శరణు జొచ్చినప్పుడు భోరుమని ఏడుస్తూ తన ఒడిలోకి లాక్కొంది సముద్రం – ఆమె కష్టాల్ని బయట పెట్టకూడదని ఆమె కడుపులో పెరిగే ఏడు నెలల పసడిగుడ్డుతో రహస్యంగా రాజీ పడింది – దేశాంతర పోయిన భర్త కోసం శతాబ్దాలుగా

ఎదురు చూస్తున్న పెద్ద ముత్తయిదువ సముద్రం – పుట్టబోయే కొత్త శిశువుకు అనుక్షణం ప్రోది చేస్తూ, గంభీరంగా ఎదురు చూసే పెద్ద బాలింతరాలు సముద్రం.

*****

ఇష్టంలేని మాంగల్యానికి సంప్రదాయం పేరిట బలిచెయ్యాలని పసుపూ పారాణి రాసి పెళ్ళి కూతర్ని చేస్తే గుండె విప్పి చెప్పుకోవాలని వచ్చిన ముక్కు పచ్చలారని అమ్మాయి మీద మూర్ఛంగా చావు తెరను కప్పింది సముద్రం. విషణ్ణ హృదయాలకీ, విచక్షణ ప్రమేయం లేని వింత పరిష్కారాలకూ, ఊరడింపులకూ, ఉపశమనానికీ వింత దేవాలయం సముద్రం.

*****

సముద్రం చాలా మంది జీవితాలకు సమవేది. ఎన్నో జీవితాలకు పారదర్శి. వెలుగు నీడల వైచిత్రులను అనుక్షణం విప్పే నిరంతర జిజ్ఞాసి. అన్నిటినీ ఆనుషంగికంగా అనుభవించాక జీవితం అంతిమ దశలో గంభీరంగా తపస్సు చేసుకొంటున్న రుషి. ఆశలు గొన్న జీవితాలకు హఠాత్తుగా ముగింపు రాసే రక్కసి. ఆకాశం, భూమీ తగాదా పడకుండా నిశ్శబ్దంగా మధ్య నిలబడే పెద్దమనిషి. హృదయంలో తియ్యదనాన్ని పంచి ఇచ్చి ఇచ్చి అందరి కన్నీటినీ పంచుకొని పంచుకొని గుండెకే కన్నీటి రుచిని అలవాటు చేసిన గరళకంఠి – సముద్రం ఒక గుర్తు, మెచ్చరిక, ఒక నినాదం. దుఃఖార్తులకు ఆటవిడుపు, రసపిపాసువులకు మేలుకొలుపు, మంచికీ చెడుకీ మధ్య తట్టగానే నిరాడంబరంగా తెరుచుకొనే తలుపు, అందమయిన తలపు.

(ఆంధ్రప్రభ వీక్లీ *17.9.1995*)

------